

శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట

శాంతి భద్రతల పరిరక్షణకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. 8లో



నిబంధనలు అతిక్రమించొద్దు

ఫుడ్ సేఫ్టీ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆహార తనిఖీ సిద్దిపేట జిల్లా అధికారి కృష్ణమూర్తి హెచ్చరించారు. నిల్వ ఆహారాన్ని తొలగించాలన్నారు. 8లో



సాగు కష్టాలు

ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు కాకపోవడంతో రేగోడ్ మండలంలోని పలువురు రైతులకు రైతు బంధు పెట్టుబడి సాయం అందడం లేదు. దీంతో ఇబ్బంది పడుతున్నారు. 9లో

న్యూస్‌రీల్

చాకరిమెట్లలో చైర్‌పర్సన్, ఎమ్మెల్యే పూజలు



పూజలు నిర్వహిస్తున్న సునీతారెడ్డి, మదన్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి చాకరి మెట్ల సహకార ఆంజనేయస్వామిని సోమవారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయం ఎల్లవేళలా అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు లావణ్యామాధవరెడ్డి, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

రామాయంపేట(మెదక్): రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) కేలండర్లను మండల కేంద్రంలో సోమవారం సంఘం జిల్లా అధ్యక్షుడు మెంగర్తి ప్రణీద్‌కుమార్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రామాయంపేట, నిజాంపేట మండలాల సంఘం అధ్యక్షుడు ఐరేని రవీందర్‌గౌడ్, దేశపతి మోహన్‌శర్మ, కార్యదర్శి ఇంద్రసేనాచారి, జిల్లా బాధ్యులు ప్రభాకర్, అబ్దుల్ రషీద్, శివరాజయ్య, నర్సింహరావు, నాగేందర్, శేఖర్, రమేశ్‌కుమార్, సంతోష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోయిన ప్రజావాణి



ప్రజావాణిల హాల్‌లో ఖాళీగా కుర్చీలు

మెదక్ కలెక్టరేట్: దరఖాస్తు దారులు లేక ప్రజావాణి కార్యక్రమం వెలవెలబోయింది. సోమవారం తూప్రాన్‌లో మంత్రి హరీశ్‌రావు కార్యక్రమం ఉండగా అదనపు కలెక్టర్లు అటు వెళ్లారు. మెదక్ కలెక్టరేట్‌లో మెదక్ ఆర్డీఓ సాయిరాం, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్‌లు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఉదయం 11 వరకు పెద్దగా ప్రజలు రాకపోవడంతో అధికారులు దరఖాస్తుదారుల కోసం వేచి చూడాల్సి వచ్చింది. మధ్యాహ్నం 12గంటల తర్వాత పలువురు తమ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. ఇందులో డబుల్ బెడ్రూంలు, ధరణి, ల్యాండ్ సర్వేకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి.

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మెదక్‌జోన్: రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ అన్నారు. సోమవారం ప్రగతి భవన్ ముట్టడిలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ లెఫ్ట్ విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా బాధ్యుడు జగన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. రన్నింగ్‌లో క్వాలిఫై అయిన పోలీసు అభ్యర్థులందరికీ మెయిన్స్ అర్హత కల్పించాలన్నారు. పాత పద్ధతిలో ఈవెంట్స్ నిర్వహించకపోవడం, రన్నింగ్‌లో క్వాలిఫై అయినా ప్రధాన పరీక్షకు అనుమతించక పోవడం వల్ల చాలా మంది నిరుద్యోగులు తమ జీవితాలను నష్టపోతున్నారన్నారు. ఈ క్రమంలోనే మంచిర్యాల జిల్లాలో పుప్పాల రవికుమార్ అనే అభ్యర్థి ఆత్మహత్య చేసుకొని చనిపోయారని అన్నారు. వెంటనే అభ్యర్థులతో చర్చలు వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్, సభ్యులు హరి, విష్ణు, రాజు, గణేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం గ్రీన్ సిగ్నల్ ఇస్తేనే..

- ఆదాయం పెంచే ప్రతిపాదనలు బుట్టదాఖలు
- షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో ప్రతిష్టంభన
- రూ.1.68 కోట్లతో అంచనాలు
- రెండున్నరేళ్లుగా చడీచప్పుడూలేని వైనం

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ తీరు మారే అవకాశం



గజ్వేల్‌లో రోడ్డు పక్కన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్

గజ్వేల్: అన్ని హంగులతో నిర్మించిన గజ్వేల్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ ఆదాయం పెంచుకునే అవకాశాలకు బ్రేక్ పడింది. 2020 జూన్ 29న 'సాక్షి'లో 'హంగులు సరే.. ఆదాయమేదీ..?' శీర్షికన ప్రచురితమైన కథనం చర్చకు దారితీసింది. సాంకేతిక అంశాల ఆధారంగా మార్కెట్‌కు ముందు భాగంలో కాకుండా ఇరుపక్కన షాపింగ్ కాంప్లెక్స్ (మడిగెల)ల నిర్మాణానికి రూ.1.68 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ ప్రస్తుతం ఆఫైలును తిరిగి పక్కన పెట్టినట్టు స్పష్టమవుతోంది. సీఎం కేసీఆర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లగలిగితేనే పరిష్కారానికి బాటలు పడే అవకాశముంది.

- సీఎం కేసీఆర్ చొరవ ఫలితంగా భారీ అభివృద్ధి పనులతో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఇప్పటికే కొత్తరూపు సంతరించుకుంది.
- ఇందులో భాగంగానే అత్యాధునిక వసతులతో 'వెజ్ అండ్ నాన్‌వెజ్' మార్కెట్ నిర్మాణం చేపట్టి 2019 డిసెంబర్ 11న సీఎం చేతుల మీదుగా ప్రారంభించారు.
- 2016 మార్చిలో పట్టణంలోని పాత ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆర్టీసీ బస్టాండ్, ఇతర ప్రభుత్వ భవనాలకు చెందిన 6.24 ఎకరాల భూమిలో మార్కెట్ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది.
- రూ. 22.85 కోట్లతో గాల్వెలూమ్ రూఫ్‌తో ఆరు భారీ షెడ్లు నిర్మించారు. వాటిలో 38 పండ్లు, పూల దుకాణాలు ఏర్పాటు చేశారు.
- కూరగాయల కోసం 150, మటన్, చికెన్, చేపల కోసం 52 షాపులను నిర్మించారు. మరో 16 వాణిజ్య దుకాణాలు ఏర్పాటు చేశారు.
- దేశంలోనే అధునాతన వసతులున్నట్టుగా చెబుతున్న మార్కెట్‌కు నెలవారీగా వస్తున్న ఆదాయం కేవలం రూ. 6.50 లక్షలు మాత్రమే.
- 246 స్టాళ్ల ద్వారా రూ. 2.73 లక్షలు, 13 దుకాణాల ద్వారా రూ. 3.02 లక్షలు, సూపర్ మార్కెట్ ద్వారా రూ. 75 వేలు వస్తున్నాయి.
- అయితే అద్దె సక్రమంగా వసూలు కాక ప్రతి నెల రూ. 1.50 లక్షల వరకు అదనంగా ఇతర నిధుల నుంచి ఖర్చుచేయాల్సిన దుస్థితి ఏర్పడుతోందని అధికారులు చెబుతున్నారు.
- ఈ పరిస్థితిని అధిగమించడానికి బస్టాండ్ పక్కన గజ్వేల్– ప్రజ్ఞాపూర్ రోడ్డు, టీవైఆర్ కాంప్లెక్స్‌లో ముందుభాగంలోనే మరో రోడ్డులో కమర్షియల్ మడిగెలు నిర్మించుకునే అవకాశముంది.
- ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుందనే ఒకే ఒక్క కారణంతో అప్పట్లో మడిగెల నిర్మాణాన్ని ఉపసంహరించుకొని హడావిడిగా పనులు పూర్తి చేశారు.
- పట్టణంలో కీలకమైన వ్యాపార ప్రాంతంగా ఉన్న ఈ రోడ్లలో ఒక్కో మడిగె సైజును బట్టి కిరాయి రూ. 40– 60 వేలకుపైనే పలుకుతుంది.

ఎలివేషన్ దెబ్బతింటుందనే..

- 2020 'సాక్షి' కథనం ఆధారంగా ముందుభాగంలో ఎలివేషన్ దెబ్బతింటుందనే కారణంగా అక్కడ మినహాయించి రెండు పక్కలా మడిగెల నిర్మాణానికి అప్పట్లో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.
- టీవైఆర్ కాంప్లెక్స్ వైపున ఉన్న దారిలో 24 రెండంతస్తుల మడిగెలు, గజ్వేల్– ప్రజ్ఞాపూర్ రోడ్డు వైపున మరో 14 సాధారణ మడిగెలు నిర్మించడానికి రూ.1.68 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు.
- వీటి ద్వారా నెలకు రూ. 6 లక్షలకుపైగా ఆదాయం వస్తుందని అంచనా వేశారు. సీఎం ఆమోదం కావాలని ప్రస్తుతం ఆ ప్రతిపాదనలు ముందుకు సాగడం లేదు.
- పరిస్థితి ఇలాగే కొనసాగితే రానురానూ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఆదాయం పడిపోయే అవకాశం లేకపోలేదు.

సీఎం దృష్టికి తీసుకెళ్తాం

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో మడిగెల నిర్మాణం వల్ల ఆర్థిక పరిపుష్టి సాధించి ఆదాయం పెంచుకునే అవకాశం ఏర్పడుతుంది. ఈ అంశాన్ని మంత్రి హరీశ్‌రావు ద్వారా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తాం. సానుకూల స్పందన వస్తుందని భావిస్తున్నాం.

– మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్

చట్టపరంగా న్యాయం చేయండి

ఎస్పీ రోహిణీప్రియదర్శిని



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ రోహిణీప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులకు చట్టప్రకారం న్యాయం చేయాలని ఎస్పీ రోహిణీప్రియదర్శిని పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాస్థాయి ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చేగుంట మండలం చిన్నశివునూర్ గ్రామానికి చెందిన చందు సాహెబ్ ఫిర్యాదు చేస్తూ.. మా తండ్రి పేర చిన్న శివునూర్ గ్రామ శివారులో 15.29 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని తెలిపారు. తండ్రి చనిపోయిన తర్వాత వేరే వాళ్లు ఆ భూమిని ఆక్రమించుకుంటున్నారని ఈ విషయంలో విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. నర్సాపూర్ గ్రామానికి చెందిన గోరేబి వాపోతూ.. నా చిన్న కొడుకు ఇంట్లోనే ఉంటూ నన్ను ఉండనీయకుండా బయటకి వెళ్లగొట్టాడని, నాకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు.

రైటర్లకు ఒక రోజు శిక్షణ



శిక్షణకు హాజరైన రైటర్లు

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలోని ఆయా పోలీసు స్టేషన్‌ల పరిధిలోని రైటర్లకు సోమవారం క్రైమ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్ (సీసీటీఎన్ఎస్) అనే అంశంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ రోహిణీప్రియదర్శిని ఆదేశాల మేరకు అవగాన కల్పించారు. సీసీటీఎన్ఎస్ అప్లికేషన్‌లో ఇప్పటి వరకు చేస్తున్న, మున్ముందు చేయబోయే రికార్డుల గురించి, అందులో పొందురిచే సమాచారం ఏవిధంగా ఉంటుంది. ప్రజలకు ఏ విధంగా ఉపయోగపడుతుంది తదితర అంశాలపై వివరించారు. ఈ శిక్షణ నేరస్తులను పట్టుకోవడం, నేరాల నివారణకు ఉపయోగపడేలా ఉంటుందన్నారు. అలాగే ఐసీజే (ఇంటరో పేరబుల్ క్రైమ్ జస్టిస్ సిస్టమ్) ద్వారా ప్రథమ సమాచార నివేదిక నమోదైన తర్వాత విచారణలో ఉన్న కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్ అప్లికేషన్ ద్వారా ఎలా నమోదు చేయాలో సూచించారు. ఏదైనా నేరానికి సంబంధించిన పూర్తి వివరాలను అనగా ఎఫ్ఐఆర్, అరెస్ట్, రిమాండ్, చార్జిషీట్, మొదలైన వాటి వివరాలను సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలన్నారు. కోర్టుల్లో పెండింగ్ కేసులు, పీఎస్‌లోని కేసులను సరి చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాపన్నపేట ఎస్ఐ విజయ్ నారాయణ్, వెల్దుర్తి ఎస్ఐ మధుసూదన్ గౌడ్ , జిల్లా రైటర్లు, సీసీటీఎన్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు ప్రియాంక



ప్రియాంకను అభినందిస్తున్న దృశ్యం

మెదక్ మున్సిపాలిటీ: మెదక్‌లోని సిద్దార్థ్ పాఠశాలకు చెందిన ఎం. ప్రియాంక జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ ప్రభాకర్ సోమవారం ఓప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 16 విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో మొదటిస్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఈనెల 12 నుంచి 14 వరకు బిహార్ రాష్ట్రం పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ప్రియాంక పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిద్దార్థ్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, ప్రిన్సిపల్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

మహిళా సంఘాల అభివృద్ధి



దుకాణంలో తనిఖీ చేస్తున్న శ్రీనివాస్

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో డ్వాక్రా గ్రూపు సంఘాల మహిళలు అభివృద్ధి చెందుతున్నారని అడిషనల్ డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం అల్లాదుర్గంలో న్యూ ఎంటర్ ప్రైజెస్ ద్వారా రుణాలు తీసుకొని నడుపుతున్న షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 171 మంది మహిళలకు ఎంటర్ ప్రైజెస్ రుణాలతో పలు రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో డీపీఎం మోహన్, అల్లాదుర్గం ఏపీఎం నాగరాజు, సీసీ సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం రావాలి



నర్సాపూర్ రూరల్: విద్యార్థినిని చదివిస్తున్న జాయింట్ డైరెక్టర్ ఉషారాణి , డీఈఓ రమేశ్

విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ఉషారాణి

నర్సాపూర్ రూరల్: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకునే ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం రావాలని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ఉషారాణి ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం నర్సాపూర్ మండలం రుస్తుంపేట ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్ ఆధారంగా తయారు చేసుకున్న ప్లాన్ ప్రకారం బోధన చేయాలన్నారు. మన ఊరు మన బడికి ఎంపికైన పాఠశాలలో పనులు ఫిబ్రవరి లో పూర్తి చేయాలని, చేయకుంటే నిధులు మళ్లి పోతాయన్నారు. ఈ సందర్భంగా పనులతోపాటు మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఓ రమేశ్ కుమార్, ఎంఈఓ బుచ్చానాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మన ఊరు– మన బడి పనులు త్వరగా పూర్తి చేయాలని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ఉషారాణి అన్నారు. సోమవారం మండల పరిధి పిల్లుట్ల ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మన ఊరు– మన బడి కి సంబంధించి పనులు పరిశీలించడంతోపాటు విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే సంకల్పంతో మన ఊరు– మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చానాయక్, సర్పంచ్ పెద్దపులి రవి, హెచ్ఎం రవీందర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేసినట్టు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కైలాసం, సెక్రటరీ రేణుక తెలిపారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల సెయింట్ మేరీస్ విద్యానికేతన్ హైస్కూల్‌లో సోమవారం సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేశారు. జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి 50 మంది క్రీడాకారులు తరలిరాగా.. వారిలో ప్రతిభ కనబర్చిన బాలుర విభాగంలో 16 మంది, బాలికల విభాగంలో 16 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశామన్నారు. బాలికలు ఈనెల 12, 13 తేదీల్లో నిర్మల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో.. బాలురు ఈనెల 21, 22 తేదీల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి జట్టుకు ప్రాతినిథ్యం వహించనున్నట్టు తెలిపారు.

మున్నూరు కాపు సంఘం కార్యవర్గం ఎన్నిక

మెదక్ మున్సిపాలిటీ: మున్నూరు కాపు సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం న్యూ భారత్ ఫంక్షన్ హాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బట్టి జగపతి పటేల్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి దేమె యాదగిరి పటేల్, మెదక్ కో ఆర్డినేటర్ వీర్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా బట్టి ఉదయ్ కుమార్ (మెదక్), ప్రధాన కార్యదర్శిగా గుండం శంకర్ (నర్సాపూర్), ఉపాధ్యక్షుడిగా బాదె చంద్రం (రామాయంపేట), మెట్టుయాదగిరి, (రామాయంపేట), సంయుక్త కార్యదర్శులుగా చింతల రాములు (రామాయంపేట), బాదె బాల్‌రాజ్ (నర్సాపూర్), కార్యదర్శులు హర్కార్ మహిపాల్ పటేల్ (మెదక్) ఆర్గనైజింగ్ సెక్రటరీ దేశెట్టి లింగం పటేల్ (నిజాంపేట), కోశాధికారి చౌరిగారి లక్ష్మీ నర్సింలు పటేల్ (కొల్చారం), జిల్లా కార్యవర్గ సభ్యులుగా అల్లాడి వెంకటేశ్ (రామాయంపేట), సింగం శెట్టి తిరుపతి (మెదక్), గాలి మహేశ్ నర్సాపూర్, పంతులు భూమయ్య (కొండపాక), మల్లేశం (రెడ్డిపల్లి), రాధాకిషన్, (రేగోడ్), దత్తు, (పెద్దశంకరంపేట), మంగరి సంతోష్ కుమార్, (అల్లాదుర్గం), సుతారి నర్సింలు, (నిజాంపేట) ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నార్సింగి ఎంపీపీ సబితా రవీందర్, మెదక్ వైస్ ఎంపీపీ మార్గం ఆంజనేయులు, కౌన్సిలర్ ఆవారి శేఖర్, యువక మండలి జిల్లా కన్వీనర్ బోనగిరి చంద్రశేఖర్, జర్నలిస్టు ఫోరం జిల్లా కన్వీనర్ శ్రీధర్ పటేల్, పట్టణ అధ్యక్షుడు నాగభూషణం, ఆయా సంఘాల అధ్యక్షులు బలరాం, వెంకన్న, గణేశ్, వివిధ మండలాల కోఆర్డినేటర్లు, కుల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన మున్నూరు కాపు సంఘం కార్యవర్గం

రైతుల శ్రేయస్సుకు అహర్నిశలు కృషి

- ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- రూ.4.98 కోట్ల వ్యయంతో వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రారంభం



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

తూప్రాన్: రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. సోమవారం తూప్రాన్ శివారులో రూ.4.98 కోట్ల వ్యయంతో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ యార్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతులు పండించే పంటకు సరైన మార్కెట్ లేని పరిస్థితుల్లో నేడు మూడు మార్కెట్‌లు 'వే సైడ్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, వ్యవసాయ మార్కెట్'ను నిర్మించుకున్నామని స్పష్టం చేశారు. రైతు బంధు ద్వారా రాష్ట్రంలో 65 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాలో జమ చేశామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా నీరు అందిస్తున్నామని ఎండాకాలంలో హల్దీ వాగు చెక్ డ్యామ్‌ల పై నుంచి మత్తడి దూకుతుందని అన్నారు. అలాగే 13 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న జీడిపల్లి, కాళ్లకల్, కూచారం, ముప్పిరెడ్డిపల్లి గ్రామ భూ నిర్వాసితులకు 374 ఇళ్ల పట్టాలు అందజేశారు. అనంతరం తూప్రాన్ పట్టణంలో రూ.22 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హేమలతా, గడా ప్రత్యేక అధికారి ముత్యంరెడ్డి, కలెక్టర్ హరీశ్, అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, రమేశ్, ఆర్డీఓ శ్యాం ప్రకాశ్, జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మోహన్, చైర్మన్, వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, కౌన్సిలర్ భగవన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలక్రిష్ణారెడ్డి, ఎలక్షన్ రెడ్డి, సత్యనారాయణగౌడ్, మహిపాల్‌రెడ్డి, భగవన్‌రెడ్డి, గడప దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పట్టణంతో పాటు మండలంలోని మల్కాపూర్ గ్రామంలో కోట్లాది రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. మల్కాపూర్‌లో నాలుగేళ్ల క్రితం కంటి వెలుగు కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించగా, రెండో విడత కార్యక్రమాన్ని ఖమ్మం జిల్లాలో ఈనెల 18న ప్రారంభించనున్నారని తెలిపారు. గడిచిన ఎనిమిదేళ్లలో ఈ గ్రామంలో రూ.27 కోట్ల 56 లక్షల పనులు చేపట్టామని తెలిపారు. కమ్యూనిటీ హాల్‌లో వంట సామగ్రి కొనుగోలుకు రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నామని అన్నారు. మల్కాపూర్ లో రూ.80లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనం, రూ.29 లక్షలతో నిర్మించిన యూత్ అండ్ లైబ్రరీ భవనం, రూ.75 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్, రూ.32 లక్షలతో నిర్మించిన మహిళా భవనాన్ని మంత్రి ప్రారంభించారు. వీటితో పాటు యావాపూర్ నుంచి మల్కాపూర్ వరకు రూ.20 కోట్లతో నిర్మించనున్న ఆర్అండ్‌బీ లింక్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్వచ్ఛ గ్రామీణ 341 కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, సర్పంచ్ మహాదేవి, ఎంపీటీసీ వెంకటమ్మ, ఉప సర్పంచ్ ఆంజనేయులుగౌడ్, మేక్ ఇన్ యువత తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీటీయూ కేలండర్ ఆవిష్కరణ

ఎస్టీటీయూ (సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం) జిల్లా నూతన సంవత్సర కేలండర్‌ను మంత్రి హరీశ్‌రావు ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, జింక అశోక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరకుల వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

ముందుచూపుతోనే 'కంటి వెలుగు'

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో కంటి వెలుగు పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులకు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమాన్ని 100 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంపై గ్రామాల్లో ప్రచారం చేయాలని, రేషన్ షాపు, గ్రామ పంచాయతీల వద్ద బ్యానర్లను ఏర్పాటు చేయించాలని అధికారులకు మంత్రి సూచించారు. అనంతరం కంటివెలుగు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను రద్దు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లాలో అంగన్‌వాడీ ఉద్యోగులకు పని భారాన్ని పెంచిన ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను రద్దు చేయాలని ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.మంగ, సీఐటీయూ నాయకుడు కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి ఐసీడీఎస్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌తో ఒకే పనిని అనేక సార్లు చేయాల్సి వస్తుందని వాపోయారు. దీంతో అంగన్వాడీలు పని ఒత్తిడితో అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్ పనిని తొలగించి భారం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు శశికళ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో ప్రతిభ



ప్రశంస పత్రం అందుకుంటున్న అర్చన

దుబ్బాకటౌన్: తెలంగాణ సోషల్‌స్టడీస్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన పదో తరగతి సాంఘికశాస్త్రం ప్రతిభా పాటవ పరీక్షలో దుబ్బాక మండలం చీకోడ్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన సోమారపు అర్చన ప్రతిభ చూపింది. పరీక్షలో ప్రతిభ చూపి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించడంతో జిల్లా విద్యాధికారులు అభినందించి ప్రశంస పత్రం అందించారు. పాఠశాల హెచ్‌ఎం పద్మజ, ఉపాధ్యాయులు ఇస్తారి స్వామి తదితరులు అర్చనకు అభినందనలు తెలిపారు.

మైనర్ అపహరణ కేసులో వ్యక్తి అరెస్టు

పటాన్‌చెరు టౌన్: ఇంటర్ సెకండియర్ చదువుతున్న ఓ బాలిక(17)ను అపహరించిన యువకుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పటాన్‌చెరు పోలీసుల వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా కొండాపూర్ మసీదు బండకు చెందిన బాలిక గతేడాది అక్టోబర్ 5న అదృశ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన గచ్చిబౌలి పోలీసులు బాలికను వెతికి తల్లిదండ్రులకు అప్పగించారు. అనంతరం బాలిక తల్లిదండ్రులు పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని అమ్మమ్మ వద్ద బాలికను ఉంచారు. ఈ క్రమంలో డిసెంబర్ 30న బాలిక మరోసారి అదృశ్యమైంది. రంగారెడ్డి జిల్లా బాలనగర్‌కు చెందిన బేగరి రవి కిరణ్ వద్ద బాలిక ఉన్నట్లు గుర్తించారు. రవికిరణ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

రేషన్ డీలర్‌పై విచారణ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని ఇబ్రహీంపూర్ రేషన్ డీలర్‌పై వచ్చిన ఆరోపణలపై సోమవారం అధికారులు విచారణ చేపట్టారు. డీలర్ జగదాంబ తమకు రేషన్ బియ్యం సక్రమంగా ఇవ్వడం లేదని లబ్ధిదారులు ఇటీవల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కాగా జిల్లా పౌరసరఫరాల ఏసీఎస్‌ఓ నిత్యానందం, డీటీసీఓ సురేష్ కుమార్, డీపీఏ దేవరాజ్ తదితరులు గ్రామానికి వెళ్లి రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసి, రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. విచారణలో అదనంగా బియ్యం ఉన్నట్లు గుర్తించి, నివేదికను అదనపు కలెక్టర్‌కు అందస్తామని తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట

- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర
- త్వరలో కొల్లూర్‌లో పోలీస్ స్టేషన్



మాట్లాడుతున్న సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శాంతి భద్రతల పరిరక్షణకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. సోమవారం రాత్రి తెల్లాపూర్‌లో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు నూతన పెట్రోలింగ్ వాహనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగా పోలీస్ నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. త్వరలోనే తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి కొల్లూరులో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని అన్నారు.

నిరంతర పెట్రోలింగ్..

రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్‌ను పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. 24 గంటలు పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులో ఉండేలా చూస్తామని, ఫోన్ చేసిన వెంటనే 5నిమిషాల్లో చేరుకునేలా చూస్తామన్నారు. పెట్రోలింగ్ వాహనాల పర్యవేక్షణ చేస్తామని, వీటి పర్యవేక్షణకు ఒక ప్రత్యేక అధికారి కూడా ఉంటారని వివరించారు. క్రైమ్ జరిగే హాట్ స్పాట్లను గుర్తించి పెట్రోలింగ్ వాహనాలతో మానిటరింగ్ చేస్తామన్నారు. రాత్రి వేళ ప్రజలకు ఇబ్బందులు లేకుండా వీధి దీపాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, తెల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ మల్లెపల్లి లలిత, ఏసీబీ కృష్ణ ప్రసాద్, సీఐ సంజయ్ కుమార్, ట్రాఫిక్ సీఐ సుమన్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి కృష్ణ, జాయింట్ సీపీ అవినాష్, మహంతి, కౌన్సిలర్లు లచ్చిరాం నాయక్, శ్రీశైలం, తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోషియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



సర్టిఫికెట్లు పొందిన అభ్యర్థులతో జెడ్పీ చైర్‌పర్సన్

సిద్దిపేటఎడ్యుకేషన్: ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం అని జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో యోగా శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సోమవారం సర్టిఫికెట్లను అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కోర్సు పూర్తి చేసిన వారు సాధన చేస్తూ ఇతరులకు నేర్పిస్తూ రోగాలపై యోగాస్త్రం సంధించాలని సూచించారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కృపాకర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన తమ సంఘం ద్వారా సర్టిఫికెట్లు పొందిన వారు యోగా టీచర్లుగా రాణించవచ్చని, ఉద్యోగాల్లో రిజర్వేషన్ అవకాశం ఉందన్నారు. 45 రోజుల పాటు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో శిక్షకులు తోట సతీష్, సంధ్యల ఆధ్వర్యంలో శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జ్ విశ్వనాథం, బీఆర్‌ఎస్ నాయకులు బుచ్చిరెడ్డి, రాష్ట్ర యోగాధ్యయన పరిషత్ సభ్యులు, శిక్షకుడు తోట సతీష్, అసోసియేషన్ బాధ్యులు అంజయ్య, తోట అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, డాక్టర్ అయోధ్య రెడ్డి, డాక్టర్ గోపాలసుదర్శనం, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



మేళాను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ భారతీ దేవి

ఆకట్టుకున్న ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మేళా

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సోమవారం ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మేళా నిర్వహించారు. 6 నుంచి పదో తరగతి విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల కళాకృతులను ప్రదర్శనకు ఉంచారు. మేళాను ప్రిన్సిపాల్ భారతీ దేవి, ఒకేషనల్ టీచర్ నీరజ, అధ్యాపకులు పరిశీలించి, ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందించారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

- గజ్వేల్ ఏసీపీ రమేశ్
- వ్యాపారులకు కౌన్సెలింగ్



వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

వర్గల్(గజ్వేల్): రాజీవ్ రహదారిపై వ్యాపారం ప్రమాదకరమని, రోడ్డు భద్రత నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని గజ్వేల్ ఏసీపీ మడత రమేశ్ హెచ్చరించారు. రోడ్డు భద్రత చర్యలో భాగంగా సోమవారం ప్రజ్ఞాపూర్ నుంచి వంటిమామిడి వరకు రాజీవ్ రహదారిపై ఇరువైపులా రకరకాల వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. వ్యాపారులు రోడ్డును ఆక్రమించి దుకాణాలు పెట్టొద్దని, దీని వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. గతంలో రాజీవ్ రహదారిపై ఇలాంటి ప్రమాదాల్లో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి చనిపోతే ఆ కుటుంబం చిన్నాభిన్నం అవుతుందని అన్నారు. రోడ్డు పక్కన దుకాణాల్లో ఏదైనా కొనాలనుకునే వాహనదారులు వాహనాలను రోడ్డుకు దూరంగా నిలపాలని సూచించారు. వాహనదారులు, వ్యాపారులు రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించినట్లు పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 27 మంది పట్టుబడగా వీరిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చారు. విచారణ అనంతరం జడ్జి 23 మందికి ఒక్కొక్కరికి రూ.2వేలు, మరో ఇద్దరికి రూ.3వేల చొప్పున, మరో ఇద్దరికి రూ.5వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

నిప్పంటుకొని గడ్డి వాములు దగ్ధం



దగ్ధమైన గడ్డివాములు

దుబ్బాకరూరల్: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గడ్డి వాములు దగ్ధమైన ఘటన భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్న నిజాంపేట గ్రామంలో జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం ఆదివారం రాత్రి మెరుపుల స్వామిగౌడ్‌కు చెందిన మూడు గడ్డి వాములకు నిప్పంటుకుంది. మంటలు ఎగిసి పడడంతో చుట్టు ప్రక్కల వారు గమనించి ఫైర్ సిబ్బందికి ఫోన్ చేశారు. అగ్నిమాపక అధికారులు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో రూ.50 వేల నష్టం వాటిల్లింది. సోమవారం ఉదయం రెవెన్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి



సయ్యద్ రహమతుల్లా (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న ఓ వ్యక్తిని ఆటో ఢీకొట్టగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ సురేందర్ రెడ్డి వివరాల ప్రకారం నెల్లూర్‌కు చెందిన సయ్యద్ రహమతుల్లా(48) పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండలో మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఇంద్రేశం వైన్స్ సమీపంలో నడుచుకుంటు వెళ్తుండగా పటాన్‌చెరు వైపు నుంచి వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రహమతుల్లాను చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు



మాట్లాడుతున్న సాయిలు

కొండాపూర్(సంగారెడ్డి): రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి,మోటారు వాహన చట్టం 2019ని సవరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి రైతు బజార్ వద్ద రవాణా రంగ కార్మికుల సంఘర్షణ యాత్రలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 20 లక్షల మంది పైగా కార్మికులు రవాణా రంగంలో పనిచేస్తున్నారని, కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టాలని కోరారు. ఈ నెల 3న ఖమ్మంలో ప్రారంభమైన జీపు జాత 11న సంగారెడ్డిలో ముగిస్తుందని, అనంతరం ఏర్పాటు చేసే సభలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రోజురోజుకు పెరుగుతున్న పెనాల్టీలు, చలాన్‌లతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, వాటిని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, జిల్లా నాయకులు మధు, వెంకటేష్, మహేందర్, మల్లేశం, రాజు, గోపాల్, షబ్బీర్, శ్రీధర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



ఫాతిమాషేక్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

గజ్వేల్: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు చైర్మన్, సభ్యులను నియమించి దళితులపై దాడులను అరికట్టాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. దేశ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ 192వ జయంతి సందర్భంగా సోమవారం గజ్వేల్‌లో ఆమె చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అనంతరం దళిత సంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. తెలంగాణలో మతోన్మాద శక్తులు దళిత, బహుజనులపై దాడులు చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాయని మండిపడ్డారు. సామాజిక విప్లవ ఉద్యమకారులు జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే బాటలో నడిచిన ఫాతిమాషేక్ అందరికీ ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు మైస రాములు, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, మాల మహానాడు రాష్ట్ర ప్రచార కార్యదర్శి తుమ్మ శ్రీనివాస్, తెలంగాణ అంబేడ్కర్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చిప్పల యాదగిరి, జిల్లా నాయకులు బ్యాగరి వేణు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యమయ్యారు. రామాయంపేట మండలం అక్కన్నపేటలో ఇంటి నుంచి మార్కెట్‌కు వెళ్లిన గృహిణి, పటాన్‌చెరులో ఓ యువకుడు అదృశ్యమయ్యారు.



సాయి కుమార్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: భానూర్–బీడీఎల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ యువకుడు అదృశ్యమైనట్లు ఎస్‌ఐ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం పటాన్‌చెరు మండలం భానూర్‌కు చెందిన సాయి కుమార్ ఈ నెల 4న రాత్రి కుటుంబ సభ్యులతో కలసి ఇంట్లో పడుకున్నాడు. ఉదయం లేచి చూసే సరికి ఇంట్లో కనిపించలేదు. తెలిసిన వారు, బంధుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సాయికుమార్ సోదరుడు వినోద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అక్కనపేటలో గృహిణి



పల్లవి

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట గ్రామానికి చెందిన గృహిణి ముత్యం పల్లవి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ రంజిత్ తెలిపారు. ఈ నెల 4న కూరగాయల కోసం మార్కెట్‌కు వెళ్లిన పల్లవి తిరిగి రాలేదు. తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో భర్త భాస్కర్ పోలీసలకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హత్య కేసులో జీవిత ఖైదు

పటాన్‌చెరు టౌన్: ఇచ్చిన డబ్బులు అడుగుతున్నాడని మరో యువకుడితో కలిసి స్నేహితుడిని హత్య చేసిన వ్యక్తికి సంగారెడ్డి జిల్లా జడ్జి జీవిత ఖైదు విధించారు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, పీపీ శ్రీనివాస్ రెడ్డి వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ భవానీపురం కాలనీకి చెందిన తమ్మిడిశెట్టి పవన్ స్నేహితుడు పితాని గౌతమ్(18) వద్ద అవసరం కోసం డబ్బు తీసుకున్నాడు. తీసుకున్న డబ్బును తిరిగి ఇవ్వాలని కోరడంతో గౌతమ్‌పై పవన్ కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో 2019 ఫిబ్రవరి 24న పవన్ మరో మైనర్ బాలుడితో కలసి గౌతమ్‌ను అమీన్‌పూర్ శివారు ప్రాంతానికి పిలిచి గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం శవాన్ని చెరువులో పడేశాడు. గౌతమ్ అదృశ్యంపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు చెరువులో మృతదేహన్ని గుర్తించారు. విచారణ చేపట్టిన పోలీసులు పవన్‌తో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించాడు. వీరిని సోమవారం కోర్టులో హాజరు పర్చగా జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి శశిధర్ రెడ్డి పవన్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.10వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల జైలు శిక్ష, కేసు పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించినందుకు గాను అదనంగా రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

జోగిపేటలో నలుగురికి..

జోగిపేట(అందోల్): హత్య కేసులో నిందితులైన నలుగురికి జీవిత ఖైదు విధిస్తూ సోమవారం సంగారెడ్డి ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్, సెషన్ జడ్జి ఎస్.శశిధర్‌రెడ్డి తీర్పునిచ్చారు. జోగిపేట సీఐ నాగరాజు వివరాల ప్రకారం 2017లో పుల్కల్ మండలం బద్రిగూడెం గ్రామంలో జరిగిన వ్యక్తి హత్యకేసులో నలుగురు నిందితులను సోమవారం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. విచారణ అనంతరం నిందితులు బైరు ఆశయ, బైరు సంతోష, బైరు యాదయ్య, బైరు రాములుకు జీవిత ఖైదుతో పాటు రూ.వేయి జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలల పాటు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత



యువకుడికి మొబైల్ అప్పగిస్తున్న పోలీస్‌లు

హుస్నాబాద్: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను పోలీస్‌లు గుర్తించి అందించారు. మండలంలోని పోతారం (ఎస్)కు చెందిన పరికరాల గణేశ్ పది రోజుల క్రితం హుస్నాబాద్‌కు వెళుతుండగా తన రూ.20వేల విలువ గల మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మున్సిపల్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న తిప్పట్ల మొగిలికి ఫోన్ దొరకడంతో అతడు పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. ఫోన్‌ను పరిశీలించిన క్రైమ్ కానిస్టేబుల్ నరేశ్ ఫోన్ పోగొట్టుకున్న గణేశ్‌ను పిలిపించి అప్పగించారు. ఫోను తిరిగి అప్పగించిన మున్సిపల్ కార్మికుడికి, పోలీస్‌లకు గణేశ్ ధన్యవాదాలు తెలిపాడు.

మరో సైబర్ మోసం

- విద్యుత్ బకాయి చెల్లించాలంటూ ఫోన్
- ఖాతా నుంచి రూ.1.28లక్షలు చోరీ

కొండపాక(గజ్వేల్): విద్యుత్ బిల్ బకాయి పెండింగ్ ఉందంటూ ఫోన్ చేసిన సైబర్ నేరస్తులు అకౌంట్‌లో నుంచి రూ.1.28లక్షలు కొట్టేశారు. త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్ వివరాల ప్రకారం కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన సురేశ్‌కు ఈ నెల 5న ఓ ఫోన్‌కాల్ వచ్చింది. తాను విద్యుత్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామని, విద్యుత్ బకాయి చెల్లించకపోతే కేసు పెడతామని బెదిరించారు. ఆన్‌లైన్ ద్వారా చెల్లించేందుకు బ్యాంక్ అకౌంట్ నంబరు చెప్పాలని కోరారు. నమ్మిన సురేశ్ బ్యాంక్ వివరాలను చెప్పడంతో సైబర్ నేరగాళ్లు తొలుత రూ.44వేలు, మరోసారి రూ.84 వేలు చోరీ చేశారు. అనుమానం వచ్చిన సురేశ్ విద్యుత్ శాఖ కార్యాలయానికి వెళ్లి ఆరా తీయగా తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

14 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లో మాజీ సర్పంచ్ చెన్నయ్యగారి నర్సింలు స్మారకార్థం ఈనెల 14 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు చక్రపాణి సోమవారం తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 13వ తేదీ సాయంత్రంలోపు ఎంట్రీ ఫీజు రూ.999 చెల్లించి, పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. అదేరోజు సాయంత్రం డ్రా ఉంటుందని, మొదటి బహుమతి రూ.22,222, ద్వితీయ బహుమతి రూ.11,111లను నగదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 96185 11408, 94404 60841 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వాలీబాల్, షటిల్..

జాతీయ యువజన క్రీడోత్సవాల సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్, షటిల్, చెస్ టోర్నమెంట్‌ను ఈనెల 11 నుంచి నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఆసక్తి గల యువకులు జట్ల పేర్లను పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఎంట్రీ ఫీజు లేదని, ఈనెల 10న సాయంత్రం ఆరు గంటలకు డ్రా తీస్తామని తెలిపారు. వివరాలకు 91770 97659, 96188 65635 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

జహీరాబాద్ టౌన్: మండలంలోని హోతి(బి) గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. పొలాల వద్ద ఏర్పాటు చేసేందుకు రైతులు ఇటీవల కొత్త ట్రాన్స్‌ఫార్మర్ తీసుకొచ్చారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని కేబుల్ తీగలు, ఆయిల్ చోరీ చేశారు. ఘటనపై రైతులు జహీరాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆహార నిబంధనలు అతిక్రమించొద్దు

ఆహార తనిఖీ జిల్లా అధికారి కృష్ణమూర్తి



దుబ్బాకలో బిర్యాని సెంటర్ నిర్వాహకుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అధికారులు

దుబ్బాకటౌన్: ఫుడ్ సేఫ్టీ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆహార తనిఖీ జిల్లా అధికారి కృష్ణమూర్తి హెచ్చరించారు. సోమవారం దుబ్బాక పట్టణంలో మున్సిపల్ కమిషనర్ గణేష్‌రెడ్డితో కలిసి పలు బిర్యానీ సెంటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బిర్యాని సెంటర్లలో నిల్వ ఉంచిన మాంసం, ఆహారాన్ని గుర్తించి చెత్తబుట్టలో పడవేశారు. రసాయనాలతో కూడిన కలర్ కలిపిన మాంసం, ఆహారపదార్థాల నిల్వ ఉంచడంపై సెంటర్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు బిర్యాని సెంటర్ల నిర్వాహకులకు రూ.5వేలు, ఇద్దరికి రూ.3వేల చొప్పున జరిమానా విధించారు. రసాయనాలతో తయారు చేసిన కలర్స్‌తో హోటల్స్‌లో ఆహార పదార్థాలు తయారు చేస్తే చర్యలు తప్పవని అన్నారు. నిల్వ ఉంచిన మాంసంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతారని ఎప్పటికప్పుడు నిల్వ ఆహారాన్ని తొలగించాలని నిర్వాహకులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ గణేష్‌రెడ్డి మాట్లాడుతూ నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ప్లాస్టిక్ ఉత్పత్తులను వాడినట్లు తెలిస్తే జరిమానాలు విధిస్తామని తెలిపారు. తనిఖీల్లో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దిలీప్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఆయిల్ దుకాణాల్లో తనిఖీ



హుస్నాబాద్ పట్టణంలో తనిఖీలు చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని పలు ఆయిల్ దుకాణాల్లో సోమవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తనిఖీలు చేపట్టారు. కొద్ది రోజులుగా కల్తీ వంట నూనె అమ్ముతున్నారనే ఆరోపణల నేపథ్యంతో తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించాలి. లైసెన్స్ లేకుండా అమ్మకాలు సాగించొద్దని నిర్వాహకులకు సూచించారు. అనంతరం కొన్ని దుకాణాల నుంచి పరీక్షల నిమిత్తం వంట నూనె శాంపిళ్లను సేకరించారు.